క్లుప్తంగా

రేపు క్రైస్తవ ప్రతినిధులతో సమావేశం

ఆర్డీఓ శ్రీనివాస రావు



తాండూరు టౌన్: నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవ ప్రతినిధులతో రేపు (గురువారం) స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ వేడుకను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూ. 2లక్షలతో నియోజకవర్గానికి వెయ్యి గిఫ్ట్ ప్యాక్‌లను (దుస్తులు) మంజూరు చేసిందన్నారు. ఈ గిఫ్ట్‌లను స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ప్రజాప్రతినిధుల సమక్షంలో అందజేయనున్నట్లు చెప్పారు. అయితే క్రిస్మస్ వేడుకలను నిర్వహించేందుకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవ ప్రతినిధులు ఆర్డీఓ కార్యాలయానికి రావాలని కోరారు.

ఘనంగా సదర్ సంబురం



దున్నల విన్యాసాలు

కొడంగల్: పట్టణంలో సదర్ సంబురాలు మంగళవారం ఘనంగా జరిగాయి. గొల్ల కురుమలు పట్టణ పురవీధుల గుండా దున్నపోతులతో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా ఆటపాటలతో అలరించారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల నుంచి గొల్ల కురుమలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతులు పట్టణవాసులను ఆకర్షించాయి యాదవ కురుమ సంఘం అభిమానులు ప్రత్యేక వేషాధారణతో ఆడి పాడారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదికలో పలువురు మాట్లాడారు. గొల్ల కురుమలు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పరిగి: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్టీయూ, యూటీఎఫ్, తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చంద్రర్‌నాయక్, ఉపాధ్యాయ సంఘ నాయకులు అమర్‌నాథ్, సత్యనారాయణరెడ్డి, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న ఆనంద్

అనంతగిరి: జిల్లాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీలను సంస్థాగతంగా బలోపేతం చేస్తామని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జిలు ఆనంద్, మల్లికార్జున్ పేర్కొన్నారు. ఈ మేరకు వికారాబాద్‌లో మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు సమాజంపై అత్యంత బాధ్యతతో ఉండే సంఘం ఎమ్మార్పీఎస్ అన్నారు. సామాజిక న్యాయం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటుందని చెప్పారు. వ్యవస్థాపరంగా సంఘాన్ని బలోపేతం చేయడానికి త్వరలో గ్రామస్థాయి నుంచి కమిటీలు వేస్తామన్నారు. జనవరి 17న సుప్రీం కోర్టులో ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వర్గీకరణపై తుది తీర్పు ఇవ్వనుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు మల్కప్ప, ప్రకాష్, అంజి, నర్సింలు, మహేందర్, నరేష్, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో నేడు (బుధవారం) ఉ.9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మహిపాల్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

రేషన్ డీలర్ మృతి

దౌల్తాబాద్: మండలంలోని కుదురుమళ్ల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ రాములుగౌడ్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన 20 ఏళ్లుగా రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. రాములుగౌడ్ మృతిపట్ల సర్పంచ్ అనిత, ఎంపీటీసీ జనార్దన్‌గౌడ్, మండల గౌడ సంఘం నాయకులు మల్కయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, జగన్‌గౌడ్‌లు సంతాపం ప్రకటించారు.

మమ అనిపించారు

సమస్యలపై గళం విప్పని సభ్యులు | హాజరుకాని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు | నామమాత్రంగా సర్వసభ్య సమావేశం



విద్యుత్ సమస్యలపై ఏఈని నిలదీస్తున్న సర్పంచ్ కేశవులు

దోమ : ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనసూయ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ నాగిరెడ్డి హాజరయ్యారు. సమావేశంలో అధికారులు 17 శాఖలపై సమీక్ష నిర్వహించాల్సి ఉండగా, కేవలం 11 శాఖలకు సంబంధించి సమీక్షను మాత్రమే నిర్వహించి మమ అనిపించారు. దీంతో సభ్యులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ప్రతి సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇద్దరు ముగ్గురు సర్పంచులు, ఓ ఎంపీటీసీ తప్ప ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా ప్రశ్నించడం లేదు. ప్రశ్నించిన వారి సమస్యలనూ పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే మగ్గుతున్నాయని సభ్యులు మండిపడుతున్నారు. కొంతమంది సభ్యులు సమావేశంలో సమస్యలపై నోరు మెదపడం లేదు. వచ్చామా? పోయామా? అన్న విధంగా సమావేశం సాగింది.

కొన్ని శాఖలపైనే చర్చ

మండల సమావేశంలో మొత్తం 36 మంది సర్పంచులు, 14 మంది ఎంపీటీసీలు 17 మంది ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాల్సి ఉంది. కేవలం కొంత మంది సర్పంచులు, అధికారులు మాత్రమే రావడంతో కొన్ని శాఖలపై చర్చించారు. దీంతో సభలో ఖాళీ కుర్చీలే దర్శనం ఇచ్చాయి. ముఖ్యంగా రోడ్లు, భవనాల శాఖ, గ్రామాల అభివృద్ధిపై చర్చ జరకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, వాటిని నిర్మించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. పాఠశాలల్లో మనఊరు- మనబడి కింద పనులు చేస్తే బిల్లులు నేటికి రాలేదని ఆయా గ్రామాల సర్పంచులు వాపోయారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని సర్పంచ్ కేశవులు సంబంధిత అధికారిపై మండిపడ్డారు. ఉపాధి హామీలో ప్రతి కూలీకి పని కల్పించాలని, నర్సరీలలో మొక్కల పెంపకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారికి ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం సూచించారు. అల్పాహారంలో భాగంగా ప్రతి పాఠశాలలో టిఫిన్లు, రాగిజావను విద్యార్థులకు అందజేస్తున్నామని ఎంఈఓ హరిచందర్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీడీఓ జయరాం. తహసీల్దార్ పురుషోత్తం, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: నిరుపేదలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ నేత మతం రాజశేఖర్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామానికి చెందిన చాకలి జంగయ్య ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మతం ప్రమీల తనయులు మతం రాజశేఖర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో సుగంశెట్టి శివకుమార్, కృష్ణయ్య, బాలయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి గ్రామానికి చెందిన మేకల పార్వతమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి స్థానిక నేతల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్, వెంకటయ్య, వెంకట్రాములు, రాములు, ఆశన్న, పెంటయ్య ఉన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి

మాస్టర్ ట్రైనర్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ట్రైనర్ మధుసూదన్‌రెడ్డి

బంట్వారం: అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని మాస్టర్ ట్రైనర్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలు ,బీఎల్ఓ సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2024 జనవరి 1వ, తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ తప్పనిసరిగా ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు పోలింగ్ బూత్‌ల వారీగా ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాల్సి ఉంటుందన్నారు. ఓటరు గుర్తింపు కార్డు చిరునామాలో మార్పులు ,చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ నాగరాజు, నరసింహారెడ్డి, తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్ ,ఆర్ఐలు విజయ్ భాస్కర్ ,తులసీరామ్ ,బీఎల్ఓలు ,బీఎల్ఓ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

23న ముక్కోటి ఏకాదశి

తాండూరు రూరల్: మండలంలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్(చంద్రగిరి)లోని శ్రీ భూదేవి శ్రీదేవి వేంకటేశ్వర ఆలయంలో ముక్కోటి ఏకాదశి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు పురందరాచార్ శుక్రవార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావునా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వారా దర్శనం చేసుకోవాలని సూచించారు.

గురుకులాన్ని తిరిగి రప్పించండి



ధారూరు: స్పీకర్‌ను కలిసి అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: మండల పరిధిలోని కేరెల్లి గ్రామానికి మంజూరైన బాలికల గురుకుల పాఠశాలను షాద్‌నగర్‌లో కొనసాగిస్తున్నారని, దానిని తిరిగి ధారూరు మండలానికి మార్చాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో స్పీకర్‌ను కలిసి సమస్యను వివరించారు. గతంలో బాలికల గురుకుల పాఠశాల కేరెల్లి గ్రామానికి మంజూరైందని, ఇక్కడ వసతులు, భవనం లేక షాద్‌నగర్‌కు మార్చారని తెలిపారు. ధారూరులో కొనసాగించాలని కోరిన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధి పట్టించుకోలేదని వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి గురుకులాన్ని ధారూరుకు మార్చేలా చూస్తామని స్పీకర్ వారికి హామీ ఇచ్చారు. స్పీకర్‌ను కలిసిన వారిలో చెన్నారెడ్డి, దయాకర్‌రెడ్డి, నాగయ్య తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

జిల్లా అభివృద్ధిపై విస్తృత ఆరాటం

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి కె. రవీందర్‌గౌడ్



ప్రొఫెసర్ హరగోపాల్‌తో జిల్లా ప్రతినిధులు

బొంరాస్‌పేట: జిల్లా అభివృద్ధిపై విస్తృతంగా తమ బాధ్యతను నిర్వహిస్తున్నామని తెలంగాణ పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జేఏసీ) రాష్ట్ర ప్రతినిధి, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి కె. రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన టీపీజేఏసీ రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రతినిధి రవీందర్‌గౌడ్, జిల్లా ప్రతినిధి గౌరారం గోపాల్ తదితరులు హాజరై చర్చించారు. టీపీజేఏసీ కన్వీ నర్ ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి జిల్లా నివేదికను సమర్పించారు. వారు మాట్లాడుతూ... జిల్లా లోని భూమి, వ్యవసాయం, విద్యా, వైద్యం, ఉపాధి కల్పన, ఉద్యోగ అవకాశాలు, సాంఘీక సంక్షేమ కార్యక్రమాలు, కార్మిక హక్కులు, మహిళల హక్కు లు, పర్యావరణ పరిరక్షణ, వివిధరకాల అభి వృద్ధి పనులపై కూలంకషంగా చర్చించామన్నారు. దీని పై కార్యాచరణ తయారు చేసి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి, నాగయ్య, ప్రొ ఫెసర్ నర్సింహారెడ్డి, పాశం యాదగిరి, ప్రొ ఫెసర్ రవిచంద్రా, శ్రీనివాస్, ధర్మార్జున్, రాఘవాచారి పాల్గొన్నారు.

విశ్వకర్మల సేవా సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

దౌల్తాబాద్ : నియోజకవర్గ విశ్వకర్మ సేవా సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్యచారి ఆధ్వర్యంలో మండల విశ్వకర్మల సేవా సంఘం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా వడ్ల వెంకట్‌రాములు, ఉపాధ్యక్షుడిగా కె.అశోక్ చారి, ప్రధాన కార్యదర్శిగా వి.అశోక్‌చారి, కోశాధికారిగా వడ్ల వెంకటేష్, ముఖ్య సలహాదారులుగా వడ్ల శ్రీనివాస్, నరసింహాచారి, సహాయ కార్యదర్శిగా నరేష్‌చారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా విశ్వకర్మ ఫెడరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీనివాస చారి, జిల్లా ఉమెన్స్ అధ్యక్షురాలు కవిత, గోపాల్‌చారి హాజరయ్యారు.

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష



మోమిన్‌పేట: స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్



కుల్కచర్ల: పడిపూజను నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

మోమిన్‌పేట: మోమిన్‌పేటలోని ఏన్కతలలో మంగళవారం అయ్యప్పస్వామి శరణు ఘోష మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భజనలు చేస్తూ, ఆడుతూ, పాడుతూ శ్రీకాంత్‌గౌడ్ స్వామి ఆధ్వర్యంలో వేడుకగా జరుపుకొన్నారు. అనంతరం స్వామివారికి అర్చనలు, ప్రత్యేకపూజలు, అభిషేకం, చందనాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం, గంధాభిషేకం, పన్నీరాభిషేకం చేశారు. స్వాములు ఆలపించిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామిని ఊయ్యాలలో ఊపుతూ పాటలు పాడారు. అనంతరం పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి పడిపై ఉన్న దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక హారతి ఇచ్చారు. స్వాములు హారతి తీసుకుని సామూహిక భిక్షలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంద్‌స్వామి వారి దర్శించుకొన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచు శ్రీరాంలు, భిక్షపతి, మైపాల్, తిరుపతిరెడ్డి, అనూప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు

కుల్కచర్ల: అత్యంత భక్తిప్రపత్తులతో అయ్యప్ప మాలధారణ గావించిన స్వాములు మంగళవారం ఇరుముడులు ధరించి శబరిమలకు బయలుదేరి వెళ్లారు. 41రోజుల భక్తిశ్రద్ధలతో మణికంఠుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమను చల్లంగా చూడాలని మొక్కులు మొక్కుకున్నారు.

ఘనంగా మహా పడిపూజ

అనంతగిరి: పట్టణంలోని ఎకే ఆర్ స్టడీ సర్కిల్‌లో మంగళవారం అయ్యప్పస్వామి మహా పడి పూజ ఘనంగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం రవి పంతులు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమం చేపట్టారు. ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. స్వామి వారికి ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శోభాయమానంగా పడిపూజ

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో నారికేళ గురుస్వామి పురుషోత్తం స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాండురంగయ్య, స్వాములు జంగయ్య, కృష్ణాజీ, చెన్నయ్య, గిరి, నవీన్, చరణ్, మహేశ్, స్థానిక భక్తజనం పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం తగదు



గాయపడ్డ విద్యార్థి మహేశ్

కొడంగల్: పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, పీఈటీలు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి సోమశేఖర్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మహేశ్ అనే విద్యార్థికి రక్తగాయాలు అయినట్లు చెప్పారు. తల్లిదండ్రులను వదిలేసి దూర ప్రాంతాల నుంచి చదువుకోడానికి వచ్చిన చిన్నారుల పట్ల దయా దాక్షిణ్యం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పీఈటీ శంకర్‌బాబును అడగగా పాఠశాలలో 400 మంది విద్యార్థులు ఉన్నారని ప్రతి ఒక్కరిని చూడడం కుదరదని సమాధానం చెప్పారని అన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్థానికంగా ఉంటూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎంఈఓ, డీఈఓలు స్పందించి విచారణ జరపాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో ప్రయోజనం

కౌన్సిలర్ సంగీతా ఠాకూర్



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సంగీతాఠాకూర్

తాండూరు టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలను బాలింతలు, గర్భిణులు, సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతాఠాకూర్ సూచించారు. మంగళవారం వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. పలు రకాల పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందజేస్తున్నారని, గర్భిణులు తప్పకుండా అక్కడే కాన్పు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, ఆయమ్మ అనిత, గర్భిణులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం

మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్



నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి: నగర అభివృద్ధికి కృష్ణస్వామి ముదిరాజ్ చేసిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం కృష్ణస్వామి ముదిరాజ్ 56వ వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ తొలిమేయర్, స్వాతంత్ర సమర యోధుడు కృష్ణస్వామి ముదిరాజ్ అన్నారు. నేడు నగరం ఇంతలా అభివృద్ధి చెందిందంటే అది కృష్ణస్వామి చేసిన అభివృద్ధితోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు రాంచంద్రయ్య, సత్యానారాయణ, మాణిక్యం, నాగేశ్వర్, హరి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వద్దు



సిబ్బందికి సూచనలు చేస్తున్న స్టీవెన్ నీల్

కుల్కచర్ల: ఉపాధిహామీ పనుల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీలో భాగంగా 2వ రోజూ చర్చించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పనులకు సంబంధించిన బిల్లులు రికార్డయినప్పటికీ నిర్వాహకులకు నిధులు అందలేదు. ఉపాధి పనుల నిర్వహణ అనంతరం బిల్లులు మంజూరైనా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం అన్ని గ్రామాల్లో కనిపించింది. కొన్ని గ్రామపంచాయతీల్లో రికార్డులు లభించకపోవడంతో వాటిని రికవరీ చేయాల్సిందిగా సూచించారు. టీఎస్ పీఎస్సీలో ఎ4గా ఉన్న డాఖ్యానాయక్ టెక్నికల్ అసిస్టెంట్‌గా నిర్వహించిన రికార్డులు పూర్తిస్థాయిలో ఆధారాలు చూపించకపోవడంతో అధికారులు రికవరీ చేయాలని చెప్పారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రూ.14వేల పెనాల్టీ విధించారు. పంచాయతీ కార్యదర్శులు హరితహారం, నర్సరీల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీఓ ఖరీం, ఏపీఓ వెంకటేశ్, ఇసి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి ఏపీఎంగా మధుకర్ బాధ్యతల స్వీకరణ



మర్పల్లి: మండల ఏపీఎంగా మధుకర్ మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సర కాలం నుంచి ఇన్‌చార్జి ఏపీఎంగా సీసీ పోచయ్య బాధ్యతలు నిర్వర్తించారు. మండల మహిళా సమైక్యా ఏపీఎంగా పూర్తి బాధ్యతలు చేపట్టేలా నూతన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో డిప్యుటేషన్‌పై మోమిన్‌పేట్ మండలంలో ఎఫ్‌పీసీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న మధుకర్‌ను సెర్ప్ సంస్థ మండల ఏపీఎంగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. మండల కేంద్రంలోని సెర్ప్ సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించి అభివృద్ధికి పాటుపడాలని ఆకాక్షించారు. అర్హులైన మహిళలను కొత్తగా సంఘంలో చేర్పుకోవాలన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న వెంకటయ్య

కొడంగల్ రూరల్: లక్ష్యం దిశగా చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్, పర్సాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో న్యాయవిజ్ఞాన సదస్సులో విద్యార్థులకు వారు చట్టాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగంలోని చట్టాల్లో పలు అంశాలపై అవగాహన కలిగి ఉండి సమాజానికి వివరిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. విద్యాహక్కు చట్టం, సమాచార హక్కుచట్టం, న్యాయ సంబంధ విషయాలపై అవగాహన కల్పించారు. మోటార్ వెహికిల్ చట్టం, సెల్‌ఫోన్ వాడకంతో కలిగే ప్రయోజనాలు, దుష్పరిణామాలు వివరించారు. ప్రాథమిక దశ ఎంతో కీలకమైనదని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటయ్య, రమేశ్, కోర్టు సిబ్బంది పకి రప్ప, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల సమయంలో బస్సు నడపాలి



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని విద్యార్థులు మంగళవారం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నీటూరు గేటుపై ఆందోళనలు చేశారు. దౌల్తాబాద్ మండలంలోని నీటూర్, కౌడీడ్, నర్సాపూర్ గ్రామాల మీదుగా నడిచే బస్సు పాఠశాల సమయానికి రావకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని నిరసనలు వ్యక్తం చేశారు. పలు గ్రామాల విద్యార్థులు పాఠశాల సమయానికి బస్సు రాకపోవడంతో తరగతులకు హాజరు కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతో ట్రాఫిక్ జాం అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. అధికారులు వెంటనే స్పందించని పక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు.